28/06/2020

## బౌళి

అదె చూడరయ్యా పెద్దహనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా ॥ పల్లవి ॥

వుదయాస్తశైలములు వొకజంగగాఁ జాఁచె
అదివో ధ్రువమండలమందె శిరసు
చదివె సూర్యునివెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతనిమహి మేమని చెప్పేమయ్యా ॥ అదె ॥

దండిగా బ్రహ్మాండముదాఁకఁ దోఁక మీఁదికెత్తె
మెండగు దిక్కులు నిండ మేను వెంచెను
గుండుగూడ రాకాసులఁ గొట్టఁగఁ జేతులు చాఁచె
అండనీతని ప్రతాప మరుదరుదయ్యా ॥ అదె ॥

దిక్కులు పిక్కటిలఁగ దేహరోమములు వెంచె
పక్కన లోకములకుఁ బ్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీవేంకటేశు హితవరిబంటాయ
మిక్కిలి నీతనిలావు మేలు మేలయ్యా ॥ అదె ॥ 5

## 3-47

# మున్నుడి

హనుమంతుని ప్రతాపాన్ని అద్భుతంగా ఈ కీర్తనలో ఆవిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇదే బాణిలో యెన్ని కీర్తనలు చెప్పినా దేవి మాధుర్యం దానిదే. హనుమంతుడు తనతోకను బ్రహ్మాండం దాక నిక్కించి, దిక్కులనిండా ఏమాత్రం సందులేకుండా తన మేను పెంచాదట. ఒక్క క్షణం వామనుని త్రివిక్రమ రూపం కనులముందు దర్శింపచేస్తోంది అన్నమయ్య వర్ణన. ఆంజనేయుడు శ్రీవేంకటేశ్వరుని 'హితవరిబంటు' అయ్యాడట అంటే ఎప్పుడూ యజమాని మేలుకోరే బంటుట. ఏమి భావన!!

**చం॥ అదె కనులార గాంచుడటు అంజన సూనుని పెద్ద కాయమున్**
**గుదిగొని దేవతల్ కొలిచి కోరికతో కొనియుడు ధీరునిన్**
**యెద పులకించు కీర్తనము యేర్పడ జెప్పెను అన్నమార్యుడున్**
**ఇది గతజన్మ భాగ్యమురు యిత్తరి మున్నుడి జెప్పితిన్ హరీ!**

**రాగం : భౌళి**

అదె చూడరయ్య పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు కొనియాడేరయ్య ॥అదె॥

ఉదయాస్త శైలములు ఒక జంగగా చాచె
అదివో ధృవమండల మందె శిరసు
చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
ఎదుట ఈతని మహిమ యేమని చెప్పేమయ్య ॥అదె॥

దండిగా బ్రహ్మాండము దాక తోక మీది కెత్తె
మెండగు దిక్కుల నిండా మేను వెంచెను
గుండు గూడ రాకాసుల కొట్టుగ చేతులు చాచె
అండ ఈతని ప్రతాప మరుదరుదయ్య ॥అదె॥

దిక్కులు పిక్కటిల్లగ దేహరోమములు పెంచె
పక్కన లోకములకు ప్రాణమై నిల్చె
నిక్కడ శ్రీవేంకటేశు హితవరి బంటాయ
మిక్కిలి ఈతని లావు మేలు మేలయ్య ॥అదె॥

**భావామృతం :**

అదిగో అటు చూడండయ్యా! పెద్ద హనుమంతుడు కనిపిస్తున్నాడు కదా! ఆ మహానుభావుని దేవతలంతా గుదికొని (అతిశయించునట్లుగా) ప్రస్తుతించి తరిస్తారు.

ఒక్క అంగతో తూర్పున ఉదయాచలమును పశ్చిమమున అస్తాచలమును ఆక్రమించి నిలుచుని యున్నాడతడు. అదిగో అతని తల ధృవమండలమును అంటుచున్నది. ఆ విధంగా నిలుచుని ఆ హనుమంతుడు తన తలను సూర్యుడు ఎటుంటే అటు తిప్పుతూ వేదములన్నీ ఆ సూర్యభగవానుని ద్వారా ఏకసంత గ్రాహివలె నేర్చుకున్నాడు. ఈతని మహిమనేమని చెప్పగలము?

ఈ హనుమంతు దండిగా (గొప్పగా) తన తోకను బ్రహ్మాండముదాకా పైకెత్తి దిక్కులన్నీ నిండిపోవునట్లుగా తన శరీరమును వ్యాపింప చేశాడు. గుండుగూడ (చుట్టుముట్టిన) రాక్షసులను చావబాదుటకు చేతులు చాచి యున్నాడు. అండయైన ఈ మహానుభావుని ప్రతాపము అరుదరుదు (చాలా అరుదు).

ఆ హనుమంతుడు దిక్కులు పిక్కటిల్లునట్లు (దిక్కులన్నీ నిండిపోవునట్లు) తన దేహముపైగల వెంట్రుకలను పెంచాడు. ఆ విధంగా లోకములన్నింటికీ ప్రాణమై నిలిచాడు. ఇక్కడ వున్న ఈ రామబంటు సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుని మేలుకోరే బంటువలె వున్నాడు. ఇతని గొప్ప గొప్ప వుపకారములు ఎంతో మంచిని చేసినవి.